వజ్రాల గనులు

భీమవరపు పురుషోత్తం

విచిత్రమైన శబ్దాలతో నిండిపోయి వుంది ఆ ప్రాంత
మంతా!

గాలి వేగంగా వీస్తూంది. అక్కడ స్థిరంగా వున్న ఒక బోర్డు 'ఇండియన్ సధరన్ డైమండ్స్ ఇన్వెస్టిగేషన్ సెంటర్' అక్షరాల్ని స్పష్టంగా చూపుతోంది!

కొండప్రాంతం అదంతా! బోర్డుకి బాగా వెనగ్గా విశాలమైన పర్వతం కొద్దిగా భూమిలోకి క్రుంగిపోయినట్టు కనిపిస్తూంది. నిజానికి అది పూర్తిగా రాతిపర్వతం కాదు. చాలా భాగం నల్లమట్టి కలసివుంది. అందులో వజ్రాల కోసం ప్రభుత్వం త్రవ్వకాలు సాగిస్తున్నది.

బోర్డుకి ఎదురుగా వున్న మైదానంలో చింతపిక్క రంగు వేన్ ఆగింది. ఎక్కడినుండో వచ్చి బిల బిల మంటూ అందులో నుండి పాతికమంది కార్మికులు దిగారు. అంతా కొద్ది ప్రక్కగా స్ప్రింగ్ గదివైపు నడిచారు. నలుగురు గార్డులు సెర్చి చేశారు వాళ్ళందరినీ ఫార్మా

లిటీగా!

సెర్చింగ్ పహావ్ కి వున్న గ్లాస్ డోర్స్ వెనుక జరిగేది తేలిగ్గా చూస్తూ, ఇన్ స్పెక్టర్ రఘువీర్ తో మాట్లాడుతున్నాడు ఇన్ ఫార్మర్ జగదీష్.

"ఇన్ స్పెక్టర్! పదిహేనవ తారీఖున నేను ప్రోగ్రస్ అందజేయాలి. ఈ రెండురోజులు మీరు కాస్త ప్రొటెక్షన్ ఇచ్చారంటే నాకే ప్రాబ్లమ్ వుండదు" అన్నాడు జగదీష్.

ఇన్ స్పెక్టర్ రఘువీర్ తాపీగా నవ్వి చెప్పాడు "జగదీష్, మే మెప్పుడూ ఎలెర్ట్ గానే వుంటాం! సరేనా!"

జగదీష్ తృప్తిగా నిట్టూర్చాడు.

సెర్చి పూర్తవడంతో కార్మికులు పక్కగదిలో వున్న తమ యూనిఫాం దుస్తులు, సామాన్లు ధరించి పహాస్ లో నుండి బయటికి వచ్చారు. అక్కడ మరో చెకింగ్ పోస్టు ఉంది! నలుగురు గార్డులు చూస్తూన్నారు. కార్మికులు దగ్గరవు రాగానే వాళ్ళు, ఒక ఆకారంలో అమర్చబడిన నాలుగు ఊచలను అడ్డు తొలగించారు.

కార్మికులు నల్లగా కనిపిస్తూన్న నిలువెత్తు గుహలాంటి మార్గంలోనికి ప్రవేశించారు. ఆ పర్వత ప్రాంతానికి, అలాంటివి మొత్తం ఐదు గుహలు యేర్పాటు చేసింది డిపార్టుమెంట్. మూడు గుహల్లోపల అప్పటికే పని ప్రారంభమైంది. ఆ శబ్దాలు బయటికి వినబడుతున్నాయి. అక్కడ ఒక దీపం వెలుగుతోంది! రాతికి బిగించబడిన చెక్కలపై వున్న స్విచ్ లు నొక్కారు.

చీకటిలో రెండు లైట్లు వెలిగాయి మారంగా! అవి అటువైపు ఫోకస్ చేయబడి వుండడంవల్ల ఆ ప్రదేశ

మంతా వెలుగుతో నిండిపోయింది. నల్లటి గోడలు మొన దేలిన అంచులవద్ద తెల్లగా మెరుస్తున్నాయి.

కార్మికులు లోపలికి నడిచారు. మొత్తం ఎనిమిది మార్గాలుగా చీలిపోయి వుంది అక్కడ సొరంగం. రెండు మార్గాలు మేకులు కొట్టబడిన పొడవాటి చెక్కలతో మూసివేయబడి వున్నాయి. అక్కడ త్రవ్వకాలు జర పడంవల్ల ఫలితం లేదని ఇంజనీర్లు ధృవపరిస్తే, వాటిని అలాగే సీల్ చేసేస్తారు.

మిగతా ఆరుమార్గాలలోనికి కార్మికులు విడిపోయారు. కుడివైపు చివరి నుండి రెండో మార్గంలోనికి ఐదుగురు కార్మికులు ప్రవేశించారు. అక్కడ అమర్చబడిన స్విచ్ నొక్కడంతో మార్గాన్ని చూపుతూ పైన 'రూఫ్'లో వున్న లైట్ వెలిగింది. చాలావరకూ వుంది మార్గం.

ఆర్కియాలజిస్టుల వివరణల ప్రకారం, నిపుణులు డైమండ్స్ లభించగలవని అంచనా వేసిన ప్రదేశాలను సర్కిల్ చేస్తుంది డిపార్టుమెంట్. తర్వాత ఆ ప్రాంతంలో మట్టిని లేదా రాతిమట్టిని న్యూక్రింగ్ జరిపిస్తారు. ఈ న్యూక్రింగ్ ద్వారానే దాదాపు రాతిలో కలిసిపోయిన డైమండ్స్ని కార్మికులు వెలికి తీస్తారు.

తర్వాత వాటిని శుద్ధి చేసి ప్యూర్ గా వున్న వజ్రాన్ని బయటికి తీయడం మరో పని!

ముందు త్రవ్వకాల ద్వారా తొలగించివేసిన మట్టిని రియాలైజేషన్ జరిపిస్తారు. ఈ ప్రక్రియ నుండి కూడా వజ్రాలు లభించడానికి ఆస్కారం వుంది. కాని అది బాగా అరుదు.

కార్మికులు ఐదుగురూ ఉదయం యెవరెక్కడ పని

చేశారో ఆ యా చోట్లను విడిపోయారు!!

ఎడం మణికట్టు కున్న హేండిల్ కి బిగించబడిన స్క్రూని పొజిషన్ లోకి అమర్చి దానికి అడుగున నలు పలకల ఆకారంలో ఉన్న బ్యాటరీ కనెక్షన్ దగ్గర చిన్న బటన్ నొక్కారు!

స్క్రూ జోరీగల గుంపు చేస్తున్న రొద లాంటి శబ్దంతో ఆన్ అయింది. దానికి ముందున్న పదునైన రోల్ ఊహించనంత వేగంగా తిరుగుతోంది. ఎడం చేతుల్లో ఉన్న బ్రష్ లతో గోడ అంచుల్ని రబ్ చేస్తూ, స్క్రూని ఆపరేట్ చేస్తున్నారు కార్మికులు. స్క్రూ రోల్ గోడను తాకగానే నింపాదిగా లోపలికి తొలుస్తూ చిన్న పెచ్చులు క్రిందికి రాలుస్తోంది!

స్క్రూకి మెషీన్ కి మధ్యలో కార్మికుడికి కనిపించేటట్టు వున్న గ్లాస్ లో రెండు లైట్లలో, పచ్చలైటు స్క్రూ ఆన్ లో ఉన్నప్పటి నుండి వెలుగుతోంది. ఎర్ర లైటు వెలిగితే స్క్రూకి తగులుతున్న మెటల్ మారినట్టు లెక్క! అది నిశ్చయంగా వజ్రాలు కలిసున్న మెటల్ కానక్కరలేదు. సాధారణంగా తగిలే మెటల్ కాకుండా యే కొద్దిపాటి తేడా వున్న మరో మెటల్ అయినప్పుడు తప్పనిసరిగా ఎర్ర లైటు వెలుగుతూంది!!

ముందే కొంతదూరం తవ్వి వుంచబడిన సొరంగం కాంతి కనిపించినంత మేరకు మార్గం కనిపిస్తూ ఆపైన నల్లగా చీకటి అలుముకొన్నట్టుంది! అందరికీ దూరంగా వున్న కార్మికుడు బ్రష్ తో తుడుస్తూ జాగ్రత్తగా స్క్రూయింగ్ చేస్తున్నాడు!!

శిరస్సును కప్పేస్తూ, కళ్ళదగ్గర పల్చటి పోలిథిన్ పేపర్ గ్లాస్ తో ఒకరకమైన క్లాత్ ముసుగులా ఉండడం

వల్ల స్ప్రేయింగ్ వల్ల రాలుతున్న మట్టిపొడి అతడిని యేమీ యిబ్బంది పెట్టకుండా మీదపడి క్రిందికి రాలి పోతోంది.

కాసేపు గడిచింది. బ్రషింగ్ చేద్దామని ఎడమచేయి ముందుకి కదిపిన అతడు ఆశ్చర్యపోయాడు! ఎర్రలైటు వెలుగుతోంది!?

ఒక్కొక్క కార్మికుడికి మూడు నాలుగు నెలలకు గానీ ఏవరేజ్ గా ఎర్రలైటు వెలగదు! స్ప్రేని కాస్త ముందుకి వదిలేడతడు. లైట్ వెలుగుతూనే వుంది. మెటల్ మారిందని అతనికి నిర్ధారణ అయింది.

పేపర్ గ్లాస్ వెనుకనున్న తన కళ్ళను తేలిగ్గా అటూ యిటూ తిప్పాడు. మిగతా నలుగురూ దీక్షగా పని చేసుకుపోతున్నారు.

అతడు స్ప్రే ఆఫ్ చేసి నాలుగు అడుగులు ముందుకు వేసి మళ్ళీ అక్కడ ప్రారంభించాడు!! ఈసారి పచ్చ లైటు మాత్రమే వెలుగుతోంది! ఏమీ తెలీనట్టు అతడు అక్కడే బ్రషింగ్ చేస్తూ తన పని తను చేసుకొంటూ పోసాగాడు.

ఆ సమయంలో అతడి చర్యను నలుగురిలో యే ఒక్క కార్మికుడు గమనించినా గార్డుకి రిపోర్టు చేయడం తర్వాత అతడిని కస్టడీలోకి తీసుకోవడం జరిగేది!!

2

సాయంత్రం ఐదు దాటింది—

ఐ.యస్.డి.ఐ.సి. కాలనీలో నుండి 187 నెంబరు గల యింటిలో నుండి పాల్ బయటికి వచ్చాడు మోటారు సైకిలుమీద. ఉదయం కావాలని ఎర్రదీపాన్ని నిర్లక్ష్యం చేసిన కార్మికుడు అతడే!

కాలనీ దాటి మెయిన్‌రోడ్ పై మూడు కిలోమీటర్ల దూరం వెళ్ళి, ఎడంవైపుకి దిగి చిన్న బాటగుండా ప్రయాణించాడు!

దాదాపు అరగంట తర్వాత ఊరికి దూరంగా విసిరి వేసినట్టున్న ఒక ఇంటిలో....

“పాల్!‘ది కేవ్’లో రాతిపొర అంతా ఫవర్ ఫుల్ గా వుందని ఈ రిపోర్టు ముందే చెప్పింది మనకు!” అన్నాడు పల్చటి గడ్డంవున్న వ్యక్తి, చేతిలో కాగితాన్ని టేబుల్ మీద వుంచుతూ. అతడి పేరు అరవిందం. మిగతా ముగ్గురికీ నాయకుడు: అతడు టేబుల్ మీద వుంచిన కాగితాన్ని పాల్ అందుకున్నాడు!

“అరవిందం సాబ్! శ్రమకు తగిన ఫలితం దక్కింది. ప్రాణాలకు తెగించి మన రాక్‌సన్ తీసుకొని వచ్చిన ఆ కాగితంవల్ల వజ్రాలు యే ప్రాంతంలో దొరుకుతాయో తెలియడం ఒక అదృష్టమయితే, ఆ ప్రాంతంలో పని చేసే పాల్ మనతో చేయి కలపడం అసలైన అదృష్టం” అన్నాడు జనార్ధన్ వినయంగా విస్కీ తాగుతూ.

అతడి మాటలు విని రాక్‌సన్ నవ్వి వూరుకున్నాడు అదోలా. అతడు మితభాషి. మనిషి మాత్రం ఎత్తుగా కండలు తిరిగి చాలా దృఢంగా వుంటాడు.

మళ్ళీ చెప్పాడు జనార్ధన్ “పాల్ సాబ్! మీరు మాత్రం యేం బెంగపెట్టుకోవద్దు. మేం చెప్పినట్టు చేయండి చాలు—వజ్రాలు మన సొంతమవుతాయి. మీకే ప్రమాదమూ వుండదు!”

అరవిందం పాల్ వంక కొద్ది క్షణాలు పరీక్షగా చూశాడు. ఇంతకు ముందులా భయంగా లేదు పాల్ ముఖం. రిలీఫ్‌గా నిట్టూర్చాడు. ముఖాన్ని గంభీరంగా

మార్చి చెప్పాడు అరవిందం "ఇప్పుడు నెక్స్ట్ ప్రొసీజర్ చెబుతాను!"

జనార్ధన్, పాల్ ఆసక్తిగా చూశారు. రాక్సన్ మామూలుగానే నవ్వాడు.

చెప్పాడు అరవిందం!?

3

రోడ్డు పై మోటారుసైకిల్ పై పోతున్నాడు పాల్. వెలుతురు చాలావరకూ తగ్గిపోయి మసగ్గా వుంది.

మోటారుసైకిలు శబ్దంలో తేడా రావడంతో స్లో చేశాడు. క్రమంగా ఆగిపోయిందది! క్రిందకు దిగి స్టాండు వేసి ప్రయత్నించాడు. లాభం లేకపోయింది.

స్టాండ్ తీసి నడిపించుకుంటూ వెళ్ళసాగాడు. దూరంగా సిటీలో లైట్లు వెలగడం అతడికి కనిపిస్తోంది. నిర్మానుష్యంగా వున్న ఆ రోడ్ పై కొద్దిదూరం నడవగానే అతడికి కాళ్ళు పీక్కుపోసాగాయి. అప్పుడప్పుడూ వెనక్కి రోడ్ మీదికి చూస్తూ నడిపిస్తున్నాడు నిస్సహాయంగా.

ఇంతలో దూరంగా ఒక అంబాసిడర్ రావడం గమనించి, గబగబా మోటారుసైకిల్ కు స్టాండ్ వేసి, రెండడుగులు ముందుకి నడిచి చేయి ఊపసాగాడు. కారు అతడిని సమీపించింది! దాటుకొంటూ వెళ్ళి ఆగింది నెమ్మదిగా కారు.

పాల్ పరుగున కారుదగ్గరికి వెళ్ళి చెప్పాడు. వెంటనే మళ్ళి తిరిగివచ్చాడు! మోటార్ సైకిల్ తీసుకొని కారు దగ్గరికి వెళ్ళి డిక్కీ తెరిచి దాన్ని అందులో పట్టాడు. ఫ్రంట్ డోర్ తెర్చుకొని కూర్చున్నాడు. కారులో ఒకే వ్యక్తి వున్నాడు డ్రైవ్ చేస్తూ!!

కారు వేగం పుంజుకొని సాగిపోతోంది.

"మిమ్మల్ని యెక్కడ దింపాలి?" అడిగాడు డ్రైవ్ చేస్తున్న వ్యక్తి.

"ఐ.యస్.డి.ఐ.సి. కాలనీ దగ్గర" నెమ్మదిగా చెప్పాడు పాల్, ఆ వ్యక్తి వంక చూస్తూ.

కనుబొమలు దగ్గరగా సాగగా ఆ వ్యక్తి పాల్ వంక చూసి అడిగాడు "డిపార్టుమెంట్ లో పని చేస్తున్నారా మీరు!?"

"అవును!"

"నేనూ డిపార్టుమెంట్ కు సంబంధించిన ఉద్యోగి నే!" చెప్పాడు అతను.

పాల్ తత్తరపడ్డాడు కొద్దిగా!

"మీరేం పని చేస్తున్నారు?...." అడిగాడా వ్యక్తి ఆసక్తిగా.

అదే మరొకరు అడిగివుంటే తప్పకుండా అబద్ధం చెప్పివుండేవాడు పాల్. ప్రస్తుతం అతడు విద్రోహులతో చేయి కలపడంవల్ల, తన పేరూ ఉద్యోగం యెవరికీ తెలియకుండా వీలయినంత జాగ్రత్త పడడం మంచిదని అతడికి తెలుసు. కానీ, ఆ వ్యక్తి తనుకూడా డిపార్టుమెంటులో ఉద్యోగినని అంటున్నాడు! అలాంటి వాడితో అబద్ధం చెబితే, తర్వాత అతడది తెలుసుకొంటే మొదటికే మోసం వస్తుంది.

"స్క్రయింగ్ మన్ ని!" చెప్పాడు పాల్ చేసేది లేక.

"ఏ 'వే'లో అడిగాడా వ్యక్తి.

"ఫస్ట్ వే."

"మీ పేరు?"

అనీజీగా కదిలి చెప్పాడు పాల్, తన పేరు.

తర్వాత ఆ వ్యక్తి డ్రైవింగ్‌లో నిమగ్నమయ్యాడు. కాసేపాగి హెడ్ లైట్స్ వెలిగించాడు, చీకట్లు ముసురు కోవడం గమనించి!

పాల్ జేబులో చెయ్యిపెట్టి సిగరెట్ పాకెట్ తీశాడు!

ఒక సిగరెట్ తీసి వెలిగించుకొన్నాడు. పొగ విండోలో నుండి ఊదుతూ ఉండిపోయాడు.

కాలనీ సమీపించాక కారు ఆపాడు ఆ వ్యక్తి.

"థాంక్స్!" అని చెప్పి పాల్ కారు దిగాడు. డిక్కీలో నుండి వాహనం తీసుకొని, నడిపించుకుంటూ కొద్దిదూరంలో కనిపిస్తూన్న కాలనీవైపు వెళ్ళిపోయాడు.

ఆ వ్యక్తి మౌనంగా కారు స్టార్టుచేసి పోనిచ్చాడు! చాలా సేపటి తర్వాత, సిటీలో ఒక ఇంటిముందు ఆగింది కారు. లైట్ల వెలుతురులో కనిపిస్తూన్న చిన్న స్థలంలో కారును ఆపి, డోర్ తెరుచుకొని దిగబోతూ ఆగి పోయాడు క్రిందికి చూస్తూ!!?

ఏదో మడతపెట్టబడిన కాగితం పడింది క్రింద? చటుక్కున అతడికి తను లిఫ్టు యిచ్చిన మనిషి గుర్తొచ్చాడు! ఆ కాగితం అతనే చూడకుండా పడేసుకున్నాడని గ్రహించి వంగి దాన్ని తీసుకొన్నాడు!

అతడు జగదీష్!!

4

బెల్ నొక్కాడు జగదీష్.

తలుపు తెర్చిన పరిమళ నవ్వింది అతడిని చూసి.

జగదీష్ నవ్వుతూ లోపలకు అడుగుపెట్టి మేడపైకి వెళ్ళి, ఆఫీస్ రూమ్ తలుపు తెర్చుకొని లోపలికి వెళ్ళాడు.

స్విచ్చులు నొక్కాడు. తెల్లటి కాంతితో గదిని నింపేస్తూ వెలిగింది. ఎదురుగా గోడకు తెల్లగా గుండ్రంగా ఉన్న దీపం. ఫాన్ స్పీడందుకుంది.

నీట్ గా సర్దినట్టు కనిపిస్తూన్న ఆ రూమ్‌లో ఫర్నిచర్స్ యెక్కువగా వుండడంతో, ఒకటి రెండుచోట్ల చిందర వందరగా వున్నట్టుంది! చేతిలో కాగితం సన్నటి గోధుమ రంగు చారలతో వున్న సన్ మైకా టేబుల్ మీద వుంచాడు. కిటికీ గ్లాస్ డోర్స్ బార్లా తెరిచి షర్టు విప్పేసి, లూజుగా వున్న పల్చటి చారల జుబ్బా ధరించి మెత్తటి కుషన్ చైర్లో రిలీఫ్ గా కూర్చున్నాడు.

చల్లగాలి మందంగా వీచడంతో హాయిగా కళ్ళు మూసుకున్నాడు, కొద్దిసేపు.

“టీ తీసుకురానా!” సన్నని స్వరం వినిపించింది.

జగదీష్ కళ్ళు తెర్చి, పరిమళ వంక చూసి “ఓ.కె” అన్నాడు చురుగ్గా. ఆమె వెళ్ళిపోయింది.

ఎదురుగా వున్న కాగితం అందుకొని క్యాజువల్ గా మడతలు విప్పాడు. ఏవో టైప్ చేసిన అక్షరాలు సంతకాలు, ముద్రలూ కనిపించడంతో, వాటిమీదికి దృష్టిని పోనిచ్చాడు—ఫోన్ మ్రోగింది ఇంతలో!

కాగితాన్ని మడతపెట్టేసి, టేబుల్ మీద మూలగా వున్న బుక్స్ మధ్య వుంచాడు!! ఫోన్ అందుకొని “హలో, జగదీష్ హియర్?” అన్నాడు.

“జగదీష్, నేను ఇన్‌స్పెక్టర్ రఘువీర్‌ను మాట్లాడుతున్నాను!” అవతలినుండి వినిపించింది.

ముందుకు వంగి అడిగాడు జగదీష్ “ఏమయింది?”

“నైట్ షిఫ్టు జరుగుతూంది! థర్డవేలో పద్ధెనిమిది కిలోల బరువుగల మెటల్ బయటికి తీసారు. డైమండ్స్

వెలుపలికి తీయడానికి పంపిస్తున్నారు. గార్డ్స్ లేబ్ వరకూ వస్తారు. తర్వాత లేబ్ దగ్గర కొంత మా ప్రొటెక్షన్ తీసుకుంటున్నారు!"

"థాంక్యూ! మరి ఇతర 'వే'ల్లో యేమీ న్యూస్ లేదా? ఇన్‌స్పెక్టర్, ఐ. యస్. డి. ఐ. సి. లెక్కల ప్రకారం నిన్నటివరకూ జరిగిన స్క్రూయింగ్‌లో రాతి పొర పోతుంది. ఆపైన స్క్రూయింగ్ జరిగే మెటల్‌లో రెండుచోట్ల మొత్తం యాభై కిలోల వరకూ మెటల్ బయల్పడాలి!?" చెప్పాడు. పరిమళ ట్రేలో బిస్కట్స్ టీ, తీసుకొని వచ్చి టేబుల్‌పై వుంచింది.

అవతలినుండి రఘువీర్ యేమీ మాట్లాడలేదు.

రిసీవర్ పెట్టేశాడు జగదీష్. చిరుచెమటలు పట్టి వున్న అతడి ముఖాన్ని చూస్తూ అడిగింది పరిమళ, "వాట్ హేపండ్ డియర్?"

ట్రే ముందుకు లాక్కొని బిస్కట్ ఒకటి తీసుకుని తిన్నాడు నెమ్మదిగా, ఆమెను చూస్తూ. టీ మగ్ అందుకొని కొద్దిగా సిప్ చేసి చెప్పాడు, "డిపార్టుమెంట్ ఇచ్చిన డిటైల్స్‌లో యేదో తేడా వచ్చినట్టు అనుమానంగా వుంది!?"

అది విని "పోసి వెరిఫికేషన్ రిపోర్టు టైప్ చేసి పంపించనా?" అడిగింది పరిమళ.

"వద్దు. రేపుకూడా చూద్దాం. ఫలితం లేకపోతే నేనే చీఫ్‌తో కన్సల్టు చేస్తాను. నా అభిప్రాయం ప్రకారం సాధారణంగా డిపార్టుమెంటు డిటైల్స్‌లో యే విధమైన పొరపాటు జరగడానికి ఆస్కారంలేదు!" చెప్పాడు జగదీష్ టీ సిప్ చేస్తూ.

"ఓ.కె!" అని నిష్క్రమించింది పరిమళ. ఆమె

అతడి భార్యే కాదు, పి.యే. కూడా.

టీ అయిపోయి పొడి పెదాలకు తగలడంతో మగ్ ను మెల్లగా టేబుల్ మీద వుంచాడు. అతడి తల వేడెక్కి-పోతోంది! డిటైల్స్ లో పొరపాటు జరగడం అసాధ్యం! ఒకవేళ ఆ పొరపాటు ఇక్కడే వుంటే?! లక్షల విలువ గల వజ్రాలు యేమయ్యాయో ఐ.యస్.డి.ఐ.సి.కి తను ఒక ఇన్ ఫార్మర్ గా తగిన సంజాయిషీ ఇవ్వవలసి వుంటుంది.

వ్యవహారం అంతదాకా పోదని అతడు సరిపెట్టుకుంటున్నా అతడి మనసు మాత్రం కీడునే శంకిస్తూంది. ఏం జరగబోతుందో అతడికి అర్థంకావడంలేదు యెంత ఆలోచించినా?!?

5

"రెండవసారి రాతి పొర తొలగించాలా?!" కళ్ళ నిండా ఆశ్చర్యాన్ని నింపుకొని ఎదుటి వ్యక్తి వంక చిత్రంగా చూస్తూ అడిగాడు ఐ.యస్.డి ఐ.సి. చీఫ్. అతడి చేతిలో చేతివ్రాతతో యేదో వ్రాసి వున్న పొడుగాటి కాగితం వుంది.

"ఎస్ సర్!" వినయంగా చెప్పాడు పాల్.

చీఫ్ యెదురుగా చిన్న కుర్చీలో కూర్చుని వున్నాడతడు.

అతడి పే, నెంబరు, లెసెన్సు మరోసారి పరిశీలించాడు చీఫ్.

అది ఐ.యస్.డి.ఐ.సి. చీఫ్ ఆఫీసరు కార్యాలయం. త్రవ్వకాలు జరిగే ప్రాంతానికి రెండు కిలోమీటర్ల దూరంలో వుందది.

మళ్ళీ ఓసారి కాగితాన్ని చదివాడు చీఫ్. ఫస్టువేలో

వున్న ఆరు కేవ్స్‌లోనూ 'బి' కేవ్‌లో పట్టి రాతిపొర కాలం ఎక్కువగా వుండడంవల్ల, డిపార్టుమెంట్ నిపుణులద్వారా అక్కడ ఒక అడుగు మందం పొర కొట్టించివేయాలని, కార్మికునిగా పాల్ దాఖలుచేసిన మెన్షన్ పేపరు అది!

డిపార్టుమెంటులో పనిచేసే ప్రతి కార్మికునికి అలాంటి పేపరు పెట్టటానికి హక్కులున్నాయి. తగిన కారణాల్ని చూపుతూ కార్మికుడు దాఖలుచేసిన 'మెన్షన్'ను స్వీకరించి తగిన రీతిన ఆ మెన్షన్ పాటించడం అక్కడి అధికార్ల విధి!

పేపర్లో పాల్ సూచించిన కాజుల్ని కొట్టివేయలేక పోతున్నాడు చీఫ్. మొత్తం రెండు కాజులవి!

1. పస్టు వేలో, 'బి' కేవ్స్‌లో గత తొమ్మిది నెలలుగా యేవిధమైన న్యూన్ (డైమండ్స్ వున్న మెటల్ లభించడాన్ని న్యూన్ అంటారు) వెలువడలేదు.
2. డిపార్టుమెంట్ నిపుణులు ఫస్టు వేను తనిఖీచేసిన పిదప, మొత్తం ఎనిమిది కేవ్స్‌లలో, రెండు కేవ్స్‌లలో ఇక 'మెటల్' లభించే అవకాశం లేదని నిర్ధారించాక, ఇక వాటిని మూసివేయ వచ్చని సలహా యిచ్చారు. (డిపార్టుమెంట్ అది అమలు జరిపింది కూడా!)

దాదాపు ఫస్టు వేలో కార్మికులంతా పాల్ మెన్షన్ సమంజసంగా వుండడంవలన, తమ అభిప్రాయం కూడా అదేనంటూ సంతకాలు చేశారు!

“కాజులు ఓకే” అన్నాడు చీఫ్, కాగితంపై పేపర్ వెయిట్ పెట్టి, మెత్తటి ఈజీచైర్‌లో బరువుగా వెనక్కి

వాలుతూ.

ముఖంలోనికి తన్నుకువస్తూన్న ఆనందాన్ని జాగ్రత్తగా నిగ్రహించుకుంటూ, "థాంక్యూ సర్!" అన్నాడు పాల్. ఎక్కువగా మాట్లాడదల్చుకోలేదు అతడు.

నాలుగు క్షణాలాగి చీఫ్ ముందుకు వంగి పెన్ పాడ్‌లో నుండి ఆకుపచ్చరంగు సిరా గల పెన్ తీసి, మెన్షన్ పేపరు క్రింద సంతకం చేసి దానిపై ఆఫీసు డిజిగ్నేషన్ ముద్ర వేసి చెప్పాడు. "ఇవాళ ఈవినింగ్ డిస్పాచ్‌లో దాన్ని హెడ్‌కి పంపిస్తాను—ఎల్లుండే నువ్వు కోరినట్టు ప్రత్యేకం జరిపిద్దాం!"

ఐ.యస్.డి.ఐ.సి.లో ఏ వ్యవహారం ఆలస్యంగా జరగదు.

పాల్ మెరిసే కళ్ళతో "థాంక్యూ సర్, థాంక్యూ యొగైన్!" అని నమస్కారం పెట్టి బయటకు వచ్చేశాడు.

చీఫ్ కార్యాలయం నుండి బయటికి వచ్చాక అన్యమనస్కంగా నడవసాగాడు పాల్. ఆ రోజు తను అరవిందం ముఠాను కలిసినప్పుడు, వాళ్ళిచ్చిన పేపరు పోయినట్టు యింటికి వెళ్ళిన పదినిమిషాలకు గ్రహించాడు. అది యెలా మాయమయిందో ముందు అర్థం కాలేదతడికి. కాసేపటికి గుర్తొచ్చింది తనకు లిఫ్ట్ యిచ్చిన కారు.

కాగితం మడత పెట్టి చొక్కా జేబులో వేసుకున్నాడు! సిగిరెట్ పెట్టె కూడా అదే జేబులో ఉండడంతో, అది బయటికి తీసినప్పుడు కాగితం క్రింద పడిపోయి వుంటుంది! మెన్షన్ పేపరు వ్రాయడానికి ముఖ్యమైన మేటర్ కావాలి (పేపర్లో సూచించడానికి!) అందుకు ఆ కాగితం

తనకిచ్చాడు అరవిందం. అది రాస్తా పోవడంతో తిరిగి అరవిందం దగ్గరకు వెళ్ళి చెప్పాడు పాల్, ఆ మర్నాడు.

అరవిందం పాల్ మీద కోప్పడి, తర్వాత ఆ కాగితం జెరాక్స్ కాపీ యిచ్చాడు. దానితో వి మెస్సెన్ పేపర్ పూర్తిచేసి, చీఫ్‌కి అందజేశాడు, పాల్.

అయితే, పోగొట్టుకున్న ఆ కాగితంలో ఎంత ముఖ్యమైన మేటర్ వుందో గుర్తొచ్చేసరికి, అతని వళ్ళంతా జలదరించింది భయంతో!

సాధారణంగా యెవరికీ అర్థంకాదు ఆ కాగితం! దుర దృష్టవశాత్తు అర్థమయితే మటుకు చాలా ప్రమాదం?! పాల్ తనకు లిఫ్ట్ యిచ్చిన వ్యక్తిని ఒకసారి గుర్తుకు తెచ్చుకున్నాడు....

తెల్లగా వుండటడి ముఖం. కనుబొమ్మలు దట్టంగా వుండి. కళ్ళచుట్టూ చర్మం కొద్దిగ నల్లగా వుంది. పెద వ్లాటి పెదాలు దాటి క్రిందికి వాలినట్టున్న మీసాలు.... ఏది యెలా వున్నా జగదీష్ కాయ మాత్రం పాల్ మెదడులో ముద్రపడిపోయింది. ఆ కాయ అతనికి బాగా గుర్తుంది!!

ఆ వ్యక్తి ఐ.ఎన్.డి ఐ.సి.లో ఉద్యోగినని చెప్పాడు తనతో!

కాని ఉద్యోగం యేమిటో అడగలేదు తను. ఆ కాగితం అతని చేతికి చిక్కడంవల్ల యే ప్రమాదమూ లేక పోతే సరే! అలా కాకుండా ఏదయినా లేదా జరిగితే అరవిందం తనను క్షమించడని పాల్‌కు తెలుసు!?!

6

17 వ తారీఖు —

టైమ్ సాయంత్రం నాలుగవుతోంది.

"సారీ మిస్టర్ జగదీష్! నా అంచనా కూడా తప్పింది" అన్నాడు ఇన్‌స్పెక్టర్ రఘువీర్. పోలీసు జీపులో వెళుతున్నారు వాళ్ళు. పనిమీద డిపార్టుమెంట్ బ్రాంచ్‌కి వెళ్ళి తిరిగివచ్చేస్తున్నారు.

నిట్టూర్చి చెప్పాడు జగదీష్ "ఇన్‌స్పెక్టర్! దానికి మీరేం చేస్తారు? డిపార్టుమెంటు అంచనా తప్పయిందనే మనం అనుకోవాలి. మొన్న సాయంత్రం పద్దెనిమిది కిలోల మెటల్ మాత్రమే లభించిందని ఇన్‌ఫర్మేషన్ డిస్పాచ్ చేసేశాను!"

తర్వాత యిద్దరూ మౌనంగా వుండిపోయారు!

కాసేపటికి జగదీష్ యింటి ముందు ఆగింది జీపు. "థాంక్యూ రఘువీర్, మళ్ళీ కలుస్తాను!" అంటూ లోపలికి నడిచాడు జగదీష్.

"ఓ.కే. బై!" అని వేగంగా పోనిచ్చాడు రఘువీర్ జీపును.

జగదీష్ తన దగ్గరున్న డూప్లికేట్ తాళంతో తలుపు తెరుచుకుని లోపలికి నడిచాడు. తలుపు మళ్ళీ లాక్ చేసి, మేడమీది తన గదికి వెళ్ళాడు. పరిమళ లేదు. కారు తీసుకొని స్నేహితురాలి దగ్గర వెళ్ళిందామె ఒంటరిగా!!

అతడు తన గది తలుపు తీసేటప్పటికే ఫోన్ మ్రోగుతోంది. త్వరగా వెళ్ళి రిసీవర్ ఎత్తాడు. అవతలి నుండి వి.యస్.డి.ఐ.సి. చీఫ్ కంఠం వినిపించింది.

"చెప్పండి సర్!" అడిగాడు జగదీష్.

"ఫస్ట్ వేలో 'బి' కేవ్‌లో రాతిపొర శాతం ఎక్కు—

వగా వుందని, ఎంత స్క్ర్యూయింగ్ జరిపినా శ్రమ వృధా అవుతుందే గానీ ఫలితం వుండడం లేదని ఒక అడుగు త్రవ్వకానికి ఆ వేలో పనిచేసే ఒక కార్మికుడు 'మెస్సన్' పెట్టుకొని ఆర్డర్ పొందాడు!" చీఫ్ బొంగురు కంఠం స్పష్టంగా వినిపించింది ఫోన్లో.

"అలాగా!" అన్నాడు జగదీష్.

"ఉదయం షిఫ్టులో ప్రారంభమయింది త్రవ్వకాల పని, సాయంత్రం షిఫ్టుకి పూర్తయిపోతూంది" చెప్పాడు చీఫ్.

"ఇట్సాల్ రైట్ సర్!" నిరాసక్తతగా చెప్పాడు జగదీష్.

అవతల చీఫ్ ఫోన్ పెట్టేయబోతుండగా అడిగాడు జగదీష్. "కార్మికుడి పేరూ, నెంబరూ సర్?"

"పాల్ — నెంబర్ 18" చెప్పాడు చీఫ్. తర్వాత ఫోన్ పెట్టిన శబ్దం.

జగదీష్ మెల్లగా రిసీవర్ పెట్టేసి, తన కుర్చీలో కూర్చున్నాడు. ఏదో కన్ఫ్యూజింగ్ గా వున్నట్టుంది అతనికి!?!

'పాల్!' ఆ పేరు ఎక్కడో విన్నట్టుంది. క్రమంగా గుర్తొచ్చింది అతనికి!! మోటార్ వెహికల్ పాడయిందని తనను లిఫ్టు అడిగిన అపరిచితుడి పేరు పాలే! ఐ.యస్. డి.ఐ.సి.లో స్క్ర్యూయింగ్ మన్ గా పని చేస్తున్నాడని చెప్పాడు. అందుకే తనకు గుర్తుండిపోయింది! ఫస్టు వే అని చెప్పినట్టు కూడా గుర్తు! ఆ అపరిచితుడే చీఫ్ చెప్పిన పాల్ అని నిర్ధారణ అయిందతడికి!!

అకస్మాత్తుగా యేదో విషయం స్ఫురించిందతనికి!!

అది! పాల్ తన కారులో పడేసుకున్న కాగితం

గురించి. ఆ కాగితం చూడాలన్న ఆసక్తి కలిగిందతనికి. వెంటనే దానిని తను ఎక్కడ పెట్టాడో గుర్తుకు తెచ్చుకున్నాడు జగదీష్.

అరనిమిషం తర్వాత పైకి లేచి టేబుల్ మీద పుస్తకాల్లో వెదకడం ప్రారంభించాడు. ఒక పుస్తకం మధ్య పేజీలో వుందది మడత పెట్టి. బయటికి తీశాడు.

త్వరగా మడతలు విప్పి కాగితం చదివాడు జగదీష్!?

కొన్ని క్షణాలవరకూ యేమీ అర్థం కాలేదతనికి. క్రమంగా ఆ కాగితంలో మేటర్ అర్థం కావడంతో అతని శరీరంలో అణుఅణువూ టెన్షన్ తో నిండిపోయింది! ముఖంనిండా చెమట బిందువులు పట్టడంతో, అవి నీళ్ళుగా మారి క్రిందికి కారసాగాయి.

జగదీష్ కర్చీఫ్ తీసి ముఖం తుడుచుకుని, కాగితం చదవడం పూర్తిచేసి, క్రింద సంతకాలు ముద్రలూ క్షుణ్ణంగా చూసి కుర్చీలో కూలబడ్డాడు. చాలాసేపు అలాగే వుండిపోయాడు.

పదిహేనవ తారీఖు వరకూ జరిగే న్యూక్ల్యియింగ్ ను బట్టి మొదటి వేలో మొత్తం యాభై కిలోల మెటల్ బయల్పడుతుందని ప్రత్యేక నిపుణులు అంచనా వేసిన ఎస్టిమేషను పేపర్ అది!

ఇన్ ఫార్మ్ చేయమని పై అధికార్లు తనకు పంపిన ఆర్డర్స్ లోని మేటర్ లోనిదే! అయితే 'వే'లు లీక్ చేయకూడదు. కనుక ఆర్డర్స్ లో ఏ 'వే'అలో మెటల్ దొరకబోతూంది సూచించలేదు.

డిపార్టుమెంట్ కి బొంబేలో వున్న హెడ్ ఆఫీస్ లో సీల్ డ్ పేపర్ అది! అప్రయత్నంగా తనలో తనే గొణు

అన్నాడు జగదీష్. "ఇది....ఇది... పాల్ దగ్గర కెలా వచ్చింది?!"

అతని మెదడు మిషన్ కంటే వేగంగా ఆలోచిస్తూ పోతోంది. పాల్ పొందిన ఆర్డర్ ప్రకారం ఫస్టు బేలో ఆడుగు మేరకు త్రవ్వకాలు జరుగుతున్నాయి ఈ రోజు. ఫస్టు 'బే లో! ఫస్టు బేలోనే మెటల్ లభిస్తుందని నిపుణులు అంచనా వేశారు. పాల్ ఫస్టు బేలో కార్మికుడే! అతడే మెస్సేజ్ చేశాడు. అధికార్లకు త్రవ్వకాలు జరిపించమని? ఈ పేపర్ అతని దగ్గరనుండి వచ్చింది....

"మైగాడ్!?" గట్టిగా అరిచినట్టు అని, ఆ యిల్లు పునాదులతో సహా కూలిపోతున్నంత కంగారుగా లేచి ఫోన్ ఎత్తి రింగ్ చేశాడు జగదీష్!

"హలో, ఇన్‌స్పెక్టర్ రఘువీర్ హియర్!" అని వినిపించగానే చెప్పాడు జగదీష్. "ఇన్‌స్పెక్టర్! మీకో సంగతి చెప్పాలి. ఫస్టు బేలో న్యూక్లియరింగ్ మన్‌గా పనిచేసే పాల్ అనే వ్యక్తి గేంబ్లింగ్ ఆడుతున్నాడు. రాంగ్ మెస్సేజ్ యిచ్చి ఆర్డర్స్ పొంది, ఫస్టు బే 'బి' కేవ్ లో ఆడుగు మందం మెటల్ చెక్కించేస్తున్నాడు!!" అంతకంటే యెక్కువ చెప్పలేకపోయాడు జగదీష్ ఆత్రుతలో.

స్వరాన్ని బట్టి అతడు పడుతున్న ఆదుర్దాను, కంగారును అంచనా వేసుకొంటూ వెంటనే "కారు వచ్చిందా? లేకపోతే నేను రానా అక్కడికి?" అడిగాడు రఘువీర్.

"ప్లీజ్! త్వరగా రండి!"

అవతల రిసీవర్ క్రేడిల్ చేసిన శబ్దం వినిపించింది.

జగదీష్ రిసీవర్ పెట్టేసి క్రిందికి వెళ్ళి తలుపు లాక్

తీసి మళ్ళీ పైకి వచ్చాడు. సరిగ్గా పదినిమిషాలకు ఆ గది తలుపులు తెరుచుకొని లోపలకు వచ్చాడు రఘువీర్.

జగదీష్ కళ్ళు మెరిశాయి, అతనిని చూడగానే! చేతిలో పేపర్ అందించాడు. రఘువీర్ దానిని చదివిన తర్వాత చెప్పాడు, చీఫ్ ఫోను చేసి చెప్పిన విషయాలు, తను పాల్‌కు లిఫ్ట్ యిచ్చిన సంగతి.

పై పెదవితో అడుగు పెదవి కొరుకుతూ సాలోచనగా వుండిపోయాడు రఘువీర్ "అతని పేరేమిటన్నారు?" అడిగాడు.

"పాల్. నెంబరు 18."

రఘువీర్ టైమ్ చూశాడు. ఐదున్నర అవుతోంది అప్పటికే!

"జగదీష్! కమాన్ క్విక్! స్పాట్‌కి వెళ్ళి చూద్దాం" అంటూ చురుకుగా కదిలాడు రఘువీర్. జగదీష్ కాగితాన్ని జాగ్రత్తగా మడతపెట్టి జేబులో పెట్టుకొని, త్వరగా రఘువీర్ వెంట కదిలాడు.

ఐ.యస్.డి.ఐ.సి. వద్దకు చేరుకున్నారు ఇద్దరూ.

ఐడెంటిఫికేషన్ చూపుతూ సెర్చింగ్ హౌస్ ప్రక్కనున్న గైడ్ రూమ్‌లోనికి వెళ్ళి అడిగారు. ఈవినింగ్ షిఫ్టుతో త్రవ్వకాలు పూర్తయ్యాయని చెప్పారక్కడ!

జగదీష్ అడిగాడు "ఎని రఫ్ మెటల్?"

"దానిని వ్యాన్‌లో పంపించివేశాం, రియలైజేషన్‌కు" చెప్పాడు ఎంక్వైరీ అధికారి,

రియలైజేషన్ యెక్కడ జరుగుతుందో తెలుసు జగదీష్‌కు. "ఎంత సేపయింది పంపి?" అడిగాడు.

"పది నిమిషాలవుతోంది!" ఆఫీసర్ చెప్పాడు.

తిరిగి ఇద్దరూ బయల్దేరారు!

సరిగ్గా అదే సమయానికి—

చింతపిక్క రంగు వ్యాన్ వేగంగా పోతోంది. రియ లైజేషన్ సెంటర్, మూడు కిలోమీటర్ల దూరంలో ఉంది ఇంకా! వ్యాన్‌కి అమర్చివున్న తొట్టిలో, పెద్ద పెద్ద రాళ్ళుగా చెక్కి వేయబడిన ఘనుపే, 'బి' కేవ్ రాతిపొర నల్లగా మెరుస్తూ కనబడుతోంది. వ్యాన్‌లో డ్రైవర్, ఇద్దరు గార్డులు మాత్రమే వున్నారు! రియలైజేషన్‌కు పంపే మెటల్‌కు అంతగా ప్రాధాన్యత ఇవ్వదు డిపార్టుమెంటు.

కొద్దిగా నీలంరంగు కలిసినట్టున్న పల్చటి తారురోడ్డు అద్దంలా వుంది సాఫీగా. రోడ్డుకు దిగువగా అటూ ఇటూ కొద్దిగా ఎర్రరంగులో వున్న మోకాలు ఎత్తు గడ్డి గాలికి కొద్దిగా వంగుతూ, కలిసికట్టుగా ఒంపులు తిరుగుతోంది.

చటుక్కున ముందుకు చూసి కంగారుపడ్డాడు డ్రైవర్. ఎదురుగా జీప్ ఒకటి వస్తోంది. పక్కకు తొలగడం లేదది, హారన్ కొట్టినా సరే! డ్రైవర్ గేరు మార్చాడు. వ్యాన్ స్పీడ్ తగ్గిపోయింది.

ఎదురుగా జీపు అలాగే వస్తూంది. గార్డులు ఒకరివంక ఒకరు చూసుకొన్నారు ఆశ్చర్యంగా! జీపు దగ్గరకు రావడంతో డ్రైవర్ బ్రేకు వేసి వేన్ ఆపేశాడు వెంటనే.

దాదాపు వేన్‌ని ముద్దినంత దగ్గరగా వచ్చి ఆగింది జీప్!

డ్రైవర్ తికేసేటట్టు చూడసాగాడు జీపులోని వ్యక్తుల వంక. "ఏయ్!" అని అరుస్తూ ఒక గార్డు క్రిందికి దిగాడు. మరో గార్డు రైఫిల్ సర్దుకుంటున్నాడు.

అప్పటికే జీప్ దిగిన రాక్‌సన్, గార్డు చేతిలో

రైఫిల్ లాక్కొని దాన్ని తిప్పి మడమతో కొట్టాడు గార్డుని బలంగా! గట్టిగా కేక పెట్టి క్రిందికి వాలిపోయాడు గార్డు

వెంటనే పెద్దగా రైఫిల్ పేలిన చప్పుడుతో పాటు రాక్‌సన్ చెవి ప్రక్కగా దూసుకుపోయిన బుల్లెట్ ఖంగుమన్న శబ్దంతో జీపు అంచుకు తగిలింది. డ్రైవర్ కంగారుగా వేన్ దిగాడు.

“రాక్‌సన్ బి కేర్‌ఫుల్!” జీపులోనుండి అరవిందం చెప్పాడు అర్చి.

రాక్‌సన్ చేతిలో వున్న రైఫిల్ తిప్పి ముందుకి గురిపెట్టి కాల్చాడు. బళ్ళున వేన్ అద్దం పగిలింది! రెండవతూటా కాల్చబోతున్న గార్డు రొమ్ముపై తగిలింది, అద్దాన్ని చీల్చుకొని వచ్చిన బులెట్. గార్డు ముందుకి జారిపోయాడు.

డ్రైవర్ మీద కలబడడంతో పిడికిలి బిగించి అతడి ముఖంమీద గుద్దాడు రాక్‌సన్. పెదాలనుండి రక్తం కారుతూండగా డ్రైవర్ వెనక్కిపడ్డాడు.

జీపులోనుండి జవార్ధన్. దిగి వాన్ కేబిన్‌లో పడి వున్న గార్డుని బయటికి లాగి, ఎక్కి. కూర్చున్నాడు. రాక్‌సన్ డ్రైవింగ్ సీట్లో కూర్చుని స్టార్టుచేశాడు! తర్వాత వెనక్కి తిప్పి వేగంగా పోనివ్వసాగాడు దానిని! వెనుక అరవిందం జీపు స్టార్టుచేసి వేన్‌ను అనుసరించాడు. అతడి ప్రక్కన పాల్ కూడా వున్నాడు.

7

దూరంగా కనిపిస్తూన్న వేన్‌ను చూసి రఘువీర్ వేగంగా వస్తున్న జీపును కొద్దిగా స్లో చేశాడు. క్రమంగా వేన్ వాళ్ళను సమీపించి దూసుకొని

పోయింది ముందుకు!!

"ఇన్‌స్పెక్టర్ స్టాప్!" గట్టిగా చెప్పాడు జగదీష్.

చటుక్కున ఆగింది జీపు. ఇంతలో యెదురుగా వస్తూన్న మరో జీపు ప్రక్కనుండి వెళ్ళిపోయింది సర్రున!

జీపులో అరవిందం పక్కన కూర్చున్న పాల్‌ని చూశాడు జగదీష్! వెంటనే రఘువీర్‌తో చెప్పాడు. "ఇప్పుడు వెళ్ళిన జీపులో తెల్లచొక్కావాడే పాల్. ముందు వెళ్ళిన వేన్ ప్రత్యేకాలు జరిపి వేరు చేసిన రాతి పొరను తీసుకొని వెళుతుంది___త్వరగా ఫాలో అవాలి మనం. లేకపోతే దాటిపోతారు రాస్కెల్స్!"

జీపు వెనక్కి తిప్పి ఏక్సిలేటర్ తొక్కాడు రఘువీర్. ముందు వెళ్ళిన వాహనాలను వేగంగా వెంబడించిందా జీపు. పల్చగా చీకట్లు వ్యాపిస్తున్నాయి అప్పటికి!

ముందు వాహనాలు స్పీడ్ పెరగడం చూసి చెప్పాడు రఘువీర్. "నేను యూనిఫాంలో వున్నానుకదా! వాళ్ళు చూశారు. మనం వెంబడిస్తున్నామని అర్థమయ్యే వుంటుంది!"

జగదీష్ యేదో చెప్పబోయాడు. ఇంతలో ముందు వెళుతున్న జీపు స్పీడ్ కొద్ది తగ్గి, హఠాత్తుగా అందులో నుండి రివాల్వర్ పేలిన శబ్దం వినిపించింది!!

"రాస్కెల్స్! తెగించేశారు. వీళ్ళను వదలకూడదు!" దృఢంగా చెప్పాడు రఘువీర్. తర్వాత మరోసారి శబ్దం వినిపించింది. జీపు ఇంజను పైభాగాన టంగుమంది!

కాసేపు గడిచింది. చీకట్లు చిక్కబడ్డాయి. ఇద్దరూ జాగ్రత్తగా ఒరిగి కూర్చున్నారు.

దూరంగా కుడివైపుకు మలుపు తిరిగివున్న గోడ్డుకి

యెడం వయిపుకి మరో దారి కనబడుతూంది చీకట్లో అస్పష్టంగా!

ముందు రెండు వాహనాలు మలుపు తిరిగి ఎడంవైపు బాటలోనుండి సాగిపోతున్నాయి వేగంగా. వాటి హెడ్ లైట్ల కాంతి కనిపిస్తూంది.

"ఇటువైపెక్కడో వాళ్ళ స్థావరం వున్నట్టుంది?" అన్నాడు జగదీష్.

ఇన్ స్పెక్టర్ రఘువీర్ జీపు కొద్దిగా స్లో చేసి ఎడం వైపుకి తిప్పాడు.

మళ్ళీ వినిపించింది రివాల్వర్ శబ్దం! మూడుసార్లు, వరసగా పేలినట్టు! కంగుమని శబ్దం వినిపించింది. తర్వాత అతి కష్టంమీద స్టీరింగ్ ను కంట్రోల్ చేస్తూ బ్రేక్ వేసి ఆపాడు రఘువీర్.

"ఏమయింది?" కంగారుగా అడిగాడు జగదీష్.

"టైరుకి తగిలినట్టుంది!" చెప్పాడు రఘువీర్. వెంటనే ఇద్దరూ జీపు దిగి చూశారు. కుడివైపు టైరు అణిగిపోయి వుంది. డీలా పడిపోయారిద్దరూ.

"ఏమయినాసరే వాళ్ళను వదలకూడదు" అన్నాడు రఘువీర్! జగదీష్ తల పంకించాడు.

రఘువీర్ ఇంజన్ ఆపి తాళాలు జేబులో వేసుకొన్నాడు. హెడ్ లైట్స్ ఆరిపోవడంతో చీకటి వ్యాపించిందక్కడ! దూరంగా వాహనాలు పోతున్న చప్పుడు కనబడుతూంది.

"వాళ్ళు ఇక్కడే ఎక్కడో ఆగుతారని నా అనుమానం! మన ప్రయత్నం మనం చేద్దాం. కొంతదూరం వెళ్ళి చూడడం మంచిదనిపిస్తూంది నాకు!" అన్నాడు రఘువీర్ మెల్లగా పరుగు అందుకొంటూ. జగదీష్ కూడా

వెంట పరిగెత్తసాగాడు.

ఆయాసపడుతూనే పదినిమిషాలపైనే పరిగెట్టారిద్దరూ!

వాహనాలు బాగా దూరం అయ్యాయి. శబ్దంకూడా వినిపించడంలేదు. కాసేపాగి మరో ఐదునిమిషాలు పైనే పరిగెట్టారు చీకట్లోనే! ఒకచోట ఆగి ఆయాసం తీర్చుకోసాగారు.

దూరంగా యేదో షెడ్‌లాంటిది చూశారు వాళ్ళు! చీకట్లో సన్నగా మసగ్గా కనబడుతూందది! రఘువీర్ వంక చూసి "అక్కడికి వెళ్ళి చూద్దాం?" అన్నాడు జగదీష్ మళ్ళీ పరిగెడుతూ.

ఇద్దరూ పరుగులాంటి నడకతో ఆ ప్రాంతానికి చేరుకున్నారు. వేన్, జీపు అక్కడ ఆపివుండడం గమనించి ఇద్దరి కళ్ళు మెరిశాయి! ఒకటి కాదు, రెండు షెడ్‌లు వున్నాయక్కడ యెదురెదురుగా. బాగా పొడుగ్గా గోడౌన్స్‌లా వున్న రేకుల షెడ్‌లవి!?

మొదటి షెడ్ వెనుక భాగానికి చేరారిద్దరూ. గోడ వారగా ముందుకు నడిచారు. రఘువీర్ లెదర్ కేసులో నుండి రివాల్వర్ తీసి పొజిషన్‌లో పట్టుకున్నాడు.

జగదీష్ అడిగాడు "ఇన్‌స్పెక్టర్! ఈ షెడ్ యేమిటీ?"

"బహుశా, రైస్ మిల్లర్స్ ఉపయోగించే గోడౌన్స్ అనుకుంటా. స్టాక్ తక్కువగా వున్నప్పుడు కాపలా పెద్దగా వుండదు. ఈ దుర్మార్గులు వీటిని తమ అవసరాలకు వాడుకొంటూ వుండవచ్చు!" చెప్పాడు రఘువీర్.

ఇంతలో షెడ్ చివర యేదో చప్పుడయింది?!

అప్పటికే ఇద్దరూ దాదాపు చివరికి వచ్చేశారు. అక్కడ ప్రదేశమంతా నిలువెత్తు గుబురుగా పెరిగి

వున్నాయి యేవేవో మొక్కలు. ఎక్కడో లైట్ వెలుగుతున్నట్టు పల్చటి వెలుతురు పడుతూంది. ఏదో నీడపడడం గమనించి చటుక్కున పక్కకు తప్పుకున్నాడు జగదీష్. రఘువీర్ ముందుకొచ్చాడు రివాల్వర్ ముందుకు పట్టుకొని.

నీడ కదిలింది! ఏదో మసక ఆకారం అటువైపు వచ్చింది. నిశ్శబ్దంగా ముందుకు నడిచారిద్దరూ! ఇప్పుడా ఆకారం ముఖం కొద్దిగా కనబడుతూంది?!

రఘువీర్ అడుగు కదిపాడు చురుగ్గా! ఆకారం మాత్రం నిశ్చలంగా నిలబడి వుంది! అతడి చేతిమీద పడింది దెబ్బ. భారంగా మూలిగాడు రఘువీర్ చెయ్యిపట్టుకొని. జగదీష్ క్రిందికి వంగాడు.

"డోంట్ మూవ్!" తాపీగా వినిపించింది ఆకారం స్వరం.

చేతిలో కర్ర క్రిందపడేసి, కుడి చేతిలో రివాల్వర్ జగదీష్‌కి గురిపెట్టి సన్నగా నవ్వుతూ నిల్చున్నాడు రాక్‌సన్.

ఇద్దరూ తెల్లబోయి చూడసాగారు? ఆకారం పూర్తిగా వెలుగులోకి వచ్చింది! అతడు అరవిందం.

8

"ఊఁ! నడవండి!" చెప్పాడు అరవిందం అదిలింపుగా.

రాక్‌సన్ ఇద్దర్నీ ముందుకు నెట్టాడు. నిస్సహాయంగా నడిచారిద్దరూ.

రఘువీర్‌కి చిరాగ్గా వుంది అంత తేలిగ్గా తాము మోసపోవడం! క్రిందపడిన తన రివాల్వరు ఊహించనంత వేగంగా తీసిన పొడవాటి ఆ దృఢకాయుడు చాలా

బలశాలి అని గ్రహించాడు. యూనిఫాంలో వున్న తనను స్పష్టంగా చూసి వాళ్ళు కించిత్తుకూడా బెదరకపోవడం ఆశ్చర్యాన్ని కలిగిస్తూంది రఘువీర్ కు!!

ముందు అరవిందం నడవగా వెనగ్గా జగదీష్, రఘువీర్ లను నడిపించుకుంటూ వెళ్ళాడు రాక్ సన్.

షెడ్ల మధ్య కొద్ది ఖాళీస్థలం వుంది ఒక్కొక్క షెడ్ కు చాలా ద్వారాలున్నాయి. వాళ్ళు వచ్చిన వైపు షెడ్ తలుపులు అన్నీ లాక్ చేయబడి వున్నాయి. దానికి ఎదురుగా వున్న మరో షెడ్ మొదటి ద్వారం తెరిచే వుంది! లోపల కాంతివంతంగా వుంది!

అరవిందం ముందు లోపలి నడిచాడు. రఘువీర్, జగదీష్ ఆశ్చర్యంగా చూస్తూ నడిచారు లోనికి!

లోపల చాలాచోట్ల బస్తాలు పేర్చివున్నాయి. కిటికీలు కూడా మూసివుండడం వలన వెలుతురు బయటికి రావడంలేదు. రాక్ సన్ రివాల్వరు అరవిందానికి అందించాడు!!

జగదీష్, రఘువీర్ ముఖంలోనికి చూశాడు. ఊహించని విధంగా వురికాడు రఘువీర్, అరవిందం పైకి! తత్తరపడ్డాడు అరవిందం రివాల్వరు జారిపోయింది.

జగదీష్ అదే క్షణంలో పిడికిలి బిగించి రాక్ సన్ మీదికి విసిరాడు. చిన్నగా మూలిగి జగదీష్ ను, దూరంగా నెట్టేశాడు రాక్ సన్. అతడు తోసిన తోపుకి అంత దూరంగా పడతానని జగదీష్ కూడా అనుకొని వుండడు! విసురుగా వెళ్ళి బస్తాల పక్కనున్న యినుప స్తంభాన్ని గుద్దుకొన్నాడు. ముందు భుజం తర్వాత తల వరసగా కొట్టుకొన్నాయి స్తంభానికి!! నిస్త్రాణంగా వాలిపోయాడు జగదీష్!

అప్పటికి రివాల్వరు అందుకున్న రఘువీర్‌ను చూసి అరవిందం రెండడుగులు కంగారుగా వెనక్కి వేసి "రాక్‌సన్!" అని అర్చాడు.

రాక్‌సన్ రఘువీర్ వైపు లాఘవంగా కదిలాడు. మరొక్క క్షణం ఆలస్యమైతే, రఘువీర్ చేతిలో రివాల్వరు అతని చేతిలో కొచ్చేదే! కానీ, రఘువీర్ దృఢంగా రివాల్వరు పట్టుకొని కాల్చాడు రాక్‌సన్ వైపు!!

కీచుమని అర్చాడు రాక్‌సన్ చాలా బాధగా. అతని భుజంమీద నుండి రక్తం పొంగుతూంది! అరవిందం కళ్ళు తేలవేసి చూస్తున్నాడు.

రఘువీర్ జాగ్రత్తగా అరవిందాన్ని కవర్ చేస్తూ, జగదీష్ దగ్గరకు నడిచాడు. అతడు మూలుగుతున్నాడు తప్ప, లేవలేకపోతున్నాడు. మోకాళ్ళ వంచి కూర్చుని జగదీష్ వైపు పూర్తిగా తలవంచి, అతని తల దగ్గర గాయాన్ని పరిశీలించాడు. కొద్దిగా రక్తం ఉండక్కడ!

"జగదీష్.... మిస్టర్ జగదీష్....?" పిల్చాడు రఘువీర్.

తల కొద్దిగా అటూ ఇటూ ఊపాడు జగదీష్. అతనిని జాగ్రత్తగా క్రిందికి దింపి పైకి లేచి చూశాడు రఘువీర్.

అరవిందం లేడక్కడ! రాక్‌సన్ మాత్రం క్రిందికి ఒంగుని బలహీనంగా మూలుగుతున్నాడు. గాయం తగిలిన చోట చింపిన షర్టు ముక్కను వణికే చేతులతో కట్టు కట్టుకొంటున్నాడు రక్తం కారకుండా. రఘువీర్ చుట్టూ చూశాడు! అరవిందం ఎక్కడా కనిపించలేదు! అప్పుడు వినిపించిందతనికి. దూరంగా వాహనాలు స్టార్టయిన చప్పుడు!!

అరవిందం మిగతా వాళ్ళతో పారిపోతున్నాడని గ్రహించాడు రఘువీర్. రాక్‌సన్ వద్దకు నడిచాడు! అతడు కోలుకొంటే చాలా ప్రమాదం అని తెలుసతడికి! రివాల్వరు తిప్పి అతని తలపై బాదాడు! నిస్సత్తువగా అలాగే క్రిందికి వాలిపోయాడు రాక్‌సన్.

రఘువీర్ పొడుగాటి ఆ షెడ్‌లో చివరికంటూ పరిగెత్తుకొంటూ వెళ్ళాడు. అక్కడ ఒక ద్వారం తెర్చివుంది కొద్దిగా. అలా వెలుపలికి వెళ్ళాడు.

బయట వ్యాన్, జీపు లేవు!? దూరంగా లైట్లు కనబడుతున్నాయి వేగంగా ప్రయాణిస్తున్నట్లు. శబ్దం క్రమంగా మాయమయింది!!

"ఇడియట్స్!" తిట్టుకున్నాడు.

తిరిగివచ్చాడు. రాక్‌సన్ని చేతులు వెనక్కి విరిచికట్టి పడేశాడు అక్కడ దొరికిన తాడుతో. వాడి పట్టు పూర్తిగా చించి బయట నీళ్ళతొట్టిలో ముంచి జగదీష్ తలకు చుట్టాడు జాగ్రత్తగా!

కాసేపటికి లేచాడు జగదీష్. రఘువీర్ జరిగింది చెప్పాడు.

బలహీనస్వరంతో చెప్పాడు జగదీష్ "ఇన్‌స్పెక్టర్! వీడిని స్టేషనుకి తీసికెళదాం! అక్కడ వీడితో సులభంగా ఆ ముఠా గురించి కక్కించవచ్చు!"

"కానీ, ప్రస్తుతం మనకు వెహికల్ ఏదీ లేదు వెళ్ళ వారిలేగానీ సిటీ చేరడం కష్టం" కొద్ది నిరాశగా చెప్పాడు రఘువీర్.

కాసేపాగి చెప్పాడు జగదీష్ "ఈ షెడ్స్‌లో టెలిఫోను ఎక్కడయినా ఉందేమో చూడండి!"

"గుడ్!" అని చురుగ్గా కదిలాడు రఘువీర్. చివరికి

షెడ్ మధ్యలో ఎత్తయిన వరుసలుగా పేర్చబడిన బస్తాల మధ్యలో కనిపించింది ఫోన్. గోడకు కొట్టబడిన చిన్న చెక్కపై వుందది. తాళం వేసివుంది!

తాళాన్ని పట్టుకొని ఉన్న ప్లాస్టిక్ గ్లాస్‌ను విరిచేసి తాళాన్ని క్రింద పడేశాడు రఘువీర్. నెంబరు డయల్ చేశాడు....

హెడ్ కానిస్టేబుల్ స్వరం విని చెప్పాడు. "నేను రఘువీర్ ని మాట్లాడుతున్నాను!"

హెడ్ స్వరం సిన్సియరుగా వినిపించింది. "యస్ సర్! చెప్పండి!"

"ఇన్ ఫార్మర్ జగదీష్ యింటికి త్రీనాట్ త్రీని పంపించు. అక్కడ జగదీష్ గారి శ్రీమతి కారు ఇస్తుంది. దానితో అతనిని యీ చోటుకు రమ్మను త్వరగా...." అని గుర్తులు చెప్పాడు.

"వాట్ సార్ యేమయింది?" ఆదుర్దాగా అడిగాడు హెడ్.

రఘువీర్ జరిగింది క్లుప్తంగా చెప్పి "కానిస్టేబుల్ ని త్వరగా పంపించు" అన్నాడు.

"నన్నూ రమ్మంటారా సార్?"

"వద్దులే. నువ్వు స్టేషను దగ్గరుండు!" అని కనెక్షన్ కట్ చేసి, జగదీష్ నెంబరు తిప్పాడు.

"హలో ___ పరిమళా స్పీకింగ్"

"నేను ఇన్ స్పెక్టర్ రఘువీర్‌ను మాట్లాడుతున్నాను" చెప్పాడు.

"చెప్పండి?" అంది.

"మా ఫోర్త్ స్టేషన్ నుండి కానిస్టేబుల్ వస్తాడు.

అతనికి మీ కారు ఇవ్వండి! జగదీష్ ఇక్కడే వున్నాడు" అన్నాడు.

"ఏం చేస్తున్నారు?"

"అంతా ఇప్పుడు చెప్పడం కుదరదు. ముందు కారు ఇచ్చి పంపండి ప్లీజ్!"

అతని మాటల్లోని ఆతృతను గుర్తించి "ఓకే" అందామె.

9

జగదీష్ ఆఫీసుగది అది—

రఘువీర్ ప్రవేశించాడు!

"ఏమన్నా చెప్పాడా?" ప్రశ్నించాడు జగదీష్.

"వాడు చెబుతాడా మన భ్రమగానీ, వాడు రాతి మనిషి. యెంత ట్రీట్‌మెంట్ ఇచ్చినా, అసలు విషయం బయిట పెట్టడం లేదు!" అని నిట్టూర్చి ఎదురుగా కూర్చున్నాడు రఘువీర్.

"ఇలాంటివాళ్ళతో కష్టమే! వాళ్ళను పట్టుకొంటే గానీ ఆ మెటల్ తిరిగి సంపాదించలేం. లక్షల విలువ గల వజ్రాలున్నాయి ఆ మెటల్‌లో!"

"సుమారు యెంత వుంటుం దేమిటి ఆ వజ్రాల విలువ?"

"ఇరవై ఐదు లక్షలవరకూ వుండొచ్చు మొత్తం విలువ!"

"మైగాడ్! యెక్కువే. వాళ్ళను త్వరగా పట్టుకోక పోతే యిలాంటివి యెన్ని చేస్తారో! ఐ.యస్.డి.ఐ.సి. గార్డుని చంపారు. ఇద్దర్ని గాయపరిచారు—డిపార్టుమెంట్ ఆఫీసర్లు ముగ్గురు, ఈ కేసు నేను డీల్ చేస్తున్నా

నని తెలిసి ఉదయమే ఫోన్‌లలో చెప్పారు గట్టిగా, నేరస్తుల్ని త్వరగా బంధించాలని!”

“గుడ్డిలో మెల్ల అన్నట్టు యింత జరిగినా కొంత అదృష్టం యేమిటంటే, త్రవ్యకాలలో ఛీట్ జరిగినట్టు డిపార్టుమెంటుకి ఇంకా తెలీదు! పదిహేడవ తారీఖున హెడ్ ఆఫీసులో సీల్డ్ పేపర్స్ అన్నీ చెక్ చేస్తారు. అప్పుడు మన దగ్గరున్న ఈ ఇన్‌ఫార్మింగ్ పేపర్ కనిపించక పోవడంతో మొత్తం జరిగిందంతా వెంటనే ఆరాతీసి తెలుసుకొంటుంది ఐ యస్.డి.ఐ.సి” చెప్పాడు జగదీప్ కొద్ది బాధగా వాలిన కళ్ళతో.

“అన్ని చెక్‌పోస్టుల దగ్గర కట్టుదిట్టమైన సెర్చింగ్ వుంది. వాళ్ళు యెక్కువ దూరం ప్రయాణం చేయలేరు ఎక్కడికీ! ఎలా చూసినా వాళ్ళు తప్పించుకోవడం అసాధ్యం!” అన్నాడు రఘువీర్.

“పద. రాక్‌సన్‌ను మరో చూపు చూద్దాం!” అంటూ లేచాడు జగదీప్.

10

ఊరికి దూరంగా వున్న ప్రదేశమది—

రెండు సరుగుడు చెట్లమధ్యనుండి నిర్మానుష్యంగా కనబడుతూంది ఆ భవనం! బాగా పాడుబడినది!!

గుబురుగా వున్న అక్కడ చెట్లమధ్య వేన్ ఆగివుంది!

భవనం లోపల హాల్లో సన్నటి శబ్దం వినబడుతూంది. స్క్రూయింగ్ శబ్దమది! అరవిందం కళ్ళుమాత్రమే కనిపించేలా పొడవాటి రుమాలు ముఖానికి కట్టుకొనివున్నాడు. చేతిలో వున్న పొడవాటి సంచిలో వేన్ వెనుక తొట్టిలో వున్న మెటల్ నింపుకొని లోపలకు తీసికెళుతున్నాడు. అతడి ఒళ్ళంతా చెమటలు పట్టివున్నాయి.

బట్టలనిండా మసి అంటుకొని వుంది.

సంచినిండా మెటల్ నింపుకొని లోపలకు వెళ్ళాడు. లోపల హాలు మధ్యలో పెద్ద టేబుల్ వుంది. దానిపై ఇనుపస్టాండుకి 'కొలేషన్' తగిలించి వుంది. మెటల్ రియలైజేషన్‌కు వాడే సాధనం అది! స్క్రూయింగ్ డ్రస్‌లో వున్న పాల్ చేతిలో స్క్రూ మెషీన్ ఆన్‌లో వుంది!

అరవిందం మోసుకొచ్చిన మెటల్ కొలేషన్‌లో వుంచి స్క్రూయింగ్ చేస్తున్నాడు పాల్. మెషీన్‌లో పచ్చలైటు మాత్రమే వెలుగుతూంది.

స్క్రూయింగ్ బల్ల పైకి చిమ్ముతూ మెరుస్తూన్న రాతి పొడి దుమ్ము రేగినట్టు హాలంతా ఆక్రమించింది. రియలైజేషన్ పూర్తయిన పొడి పెద్ద కుప్పలా పేరుకొనిపోయి, టేబుల్ మీదనుండి క్రిందికి పడుతూంది. ఉదయం అరవిందం, జనార్దన్ సంచులతో చాలా మెటల్ మోసారు! ప్రస్తుతం జనార్దన్ పనిమీద బయటికి వెళ్ళడంతో అరవిందం ఒక్కడే పని చేయవలసి వస్తూంది.

అప్పటికి సగానికిపైనే మెటల్ స్క్రూయింగ్ జరిగిపోయింది. మరోసారి సంచినింపి కొలేషన్‌లో వేశాడు అరవిందం. పాల్ స్క్రూని రన్ చేస్తున్నాడు! సరిగ్గా రెండు క్షణాలు గడిచాయి?! పాల్ కళ్ళు పెద్దవయ్యాయి!?

ఎర్రలైటు వెలిగివుంది!!

ఆనందం పట్టలేక "అరవిందం సార్! త్వరగా రండి సక్సెస్! గ్రాండ్ సక్సెస్!!" వెర్రిగా పిల్చాడు పాల్, అరవిందాన్ని.

అరవిందం చేతిలో సంచి పడేసి దగ్గరకొచ్చాడు.

స్క్రూ ఆఫ్ చేసి చెప్పాడు పాల్. "ఈ మెటల్‌లోనే డైమండ్స్ వుంది!"

కాలేషన్‌లో కనబడుతూన్న మెటల్ వంక కళ్ళు విప్పార్చుకుని చూశాడు అరవిందం. ఆశకి పెదవులు కొద్దిగా వణికాయి సంతోషంతో. "కమాన్ క్విక్! మెటల్‌ను స్క్రూ చెయ్!" చెప్పాడు పాల్‌ను తొందర పెడుతూ.

దాదాపు అరగంట తర్వాత గరుగ్గా, బరువుగా ఒక ఆకారంలేని అంతర్గతంగా తెలుపు రంగు కలసివున్న లేత నీలిరంగు రాళ్ళు పదకొండు వెలుపలికి తీశాడు పాల్ మెటల్‌లోనుండి!!

అరవిందం కర్చీఫ్ తీసి జాగ్రత్తగా వాటిని మూట గట్టుకొని జేబులో కూరుకున్నాడు వెంటనే! పాల్ ముఖంలో కొద్దిగా రంగులు మారాయి!! అయినా మాట్లాడకుండా ఊరుకున్నాడు.

నిలువెల్లా ఆనందంతో గాలిలో తేలుతున్నట్టున్నాడు అరవిందం. "వెల్ డన్ పాల్! వెల్ డన్!!" అంటూ పాల్‌ని అభినందించాడు.

బయట జీపు వస్తూన్న శబ్దం వినిపించింది!?

అరవిందం బయటికి వచ్చాడు. జనార్ధన్ క్రిందికి దిగాడు, చేతిలో ఫుడ్ టిన్స్‌తో! పాల్ కూడా వచ్చాడు అక్కడికి. ఏదో చెప్పబోతుంటే అరవిందం కంటితో సైగ చేశాడు పాల్‌కు.

మౌనంగా వుండిపోయిన పాల్‌ని చూసి "ఏమయింది! వజ్రాలు బయటపడ్డాయా?" అడిగాడు జనార్ధన్.

"లేదు! ఇంకా స్క్రూయింగ్ జరుగుతూంది. ఇంకా కొద్ది మెటల్ వుంది. బహుశా అందులో వుండవచ్చు

డైమండ్స్" తాపీగా చెప్పి, "ఆ టిన్స్ అక్కడపెట్టి, మిగతా మెటల్ నువ్వు మోయి!" అన్నాడు అరవిందం.

పాల్‌కు అర్థం కావటంలేదు అరవిందం ప్రవర్తన! అతడు చాలా ప్రమాదకారి అని మాత్రం అవగాహన అవుతోంది దతడికి!!

జనార్దన్ కదిలాడు. ఫుల్ టిన్స్ వరండాలో బల్లపై వుంచి, సంచి అందుకొని వేన్‌లో మెటల్ నింపాడు. దానినిండా. "చాలా వరకూ అయిపోయిందే! ఇంత మెటల్ క్రష్యాయింగ్ చేసినా డైమండ్స్ బయటపడ లేదా!?" సంచిలోపలకు మోస్తూ ఆశ్చర్యంగా అడిగాడు ఇంద్రీష్.

అరవిందం మాట్లాడలేదు. ఏదో ఆలోచిస్తున్నట్లు, అస్పష్టంగా జేబు తడుముకుంటూ దిక్కులుచూస్తూ వుండి పోయాడు. పాల్ మాత్రం కదలకుండా చేతిలో క్రష్ మెషీన్‌తో కొయ్యలా నిలబడివున్నాడు.

జనార్దన్, పాల్ వంక చూసి ఆగిపోయాడు. అరవిందం పాల్‌కు కళ్ళతో యేదో సైగలు చేస్తూ, అసహనంగా చెప్పాడు, "పాల్! క్రష్యాయింగ్ ప్రారంభించు నువ్వు. పని త్వరగా తెముల్చుకొని మరో ప్రాంతానికి వెళ్ళిపోవడం మంచిది మనం! రాక్సన్ ద్వారా పోలీసులు యేక్షణానయినా ఈ ప్రాంతాన్ని కనుగొనవచ్చు!"

పాల్ కదల్లేదు. ఒక విషయం మాత్రం గ్రహించాడతడు. అరవిందం పెద్ద ఛీటర్. ప్రస్తుతం జనార్దన్‌ను యేదోవిధంగా వదిలించుకోవాలనుకొంటున్నాడు. వజ్రాలలో తనకు మాత్రమే వాటా యిచ్చేటట్టు ప్రవర్తిస్తు న్నాడు. అది కేవలం నటనే అయ్యుండొచ్చు! జనార్దన్

తొలగితే రేపు తనను కూడా అడ్డుతప్పిస్తాడు నిశ్చయంగా!

జనార్ధన్ అప్పటికే సంచి క్రింద పెట్టి ఆశ్చర్యంగా చూడసాగాడు పాల్ వంక!?

"పాల్ నీకే చెప్పేది! ఏమిటాలోచిస్తున్నావ్? స్ప్రేయింగ్ మొదలుపెట్టు, కమాన్ క్విక్" తీవ్రంగా చెప్పాడు అరవిందం.

నెమ్మదిగా కదిలి జనార్ధన్ వంక చూసి చెప్పాడు పాల్ "జనార్ధన్! నువ్వు వచ్చేటప్పటికే వజ్రాలున్న రాళ్ళు లభించాయి పెట్టెలో! ఈ అరవిందం నీకు వాటా ఇవ్వడానికి ఇష్టంలేక...."

పాల్ ఆగిపోయి నిలువెల్లా వణికిపోసాగాడు. అరవిందం ముఖం మూసి!! శరీరంలోని రక్తమంతా ముఖం లోనికి పాకినట్టు ఎర్రబడిన ముఖంతో, ఎర్రజీరలతో కూడిన కనుగుడ్లతో క్రూరంగా చూస్తున్నాడు అరవిందం, పాల్ వంకే!?

ఇటువైపు పాల్ చెప్పింది విని జనార్దన్ ముఖంలో రంగులు మారసాగాయి! క్రమంగా అది అర్ధంకాక డంతో నమ్మలేకపోతున్నాడతడు తను విన్న మాటల్ని!!

అరవిందం చేతిలో రివాల్వర్ ప్రత్యక్షమైంది!! వెర్రిగా చూశాడు పాల్.

"ఇడియట్. మెన్షన్ పేపర్ పడవేసినప్పుడే నిన్ను చంపిపారేద్దామనుకొన్నాను! నీ అవసరం వుండడంవల్ల ఇంతవరకూ వదిలాను — ఇప్పుడు నువ్వు చేసిన పనికి నిన్ను క్షమించడం అంత మూర్ఖత్వం మరొకటిలేదు! చావు!" అంటూ పేల్చాడు రెండుసార్లు.

భిగ్గరగా అర్చి కూలిపోయాడు పాల్. అతని చేతిలో స్ప్రే మెషిన్ దూరంగా పడింది. బుల్లెట్లు అతడి

స్ప్రయింగ్ మన్ దుస్తుల్ని చీల్చుకొని పోయాయి!! గుండెలపై పొంగుతూన్న రక్తం అతడి దుస్తుల్ని తడి చేస్తూ క్రిందికి కారుతోంది.

అరవిందం పూనకం వచ్చినట్టు జనార్ధన్ వైపు తిరిగాడు.

తటాలున క్రింద వుంచిన సంచి అందుకొని అడ్డుపట్టు కొన్నాడు-జనార్ధన్! రివాల్వర్ పేల్చాడు అరవిందం!? బరువైన సంచి చిన్నాభిన్నమైంది. అందులో మెటల్ క్రిందికి రాలిపోయింది.

ఆలస్యం చేయకుండా చప్పున లోనికి గెంతాడు జనార్ధన్. ఈసారి అరవిందం పేల్చిన బులెట్ గోడ అంచుకు తగిలింది. పెచ్చులు ఊడిపోయింది గోడ అక్కడ బులెట్ విసురుకి!!

చురుగ్గా కదిలాడు అరవిందం. రెండు పుష్ టిన్స్ అందుకొని, పాల్ శవాన్ని తొక్కుకుంటూ కంగారుగా కదిలాడు!! రెండడుగులు వేశాక అనుకోకుండా అతడి కాలు క్రిందపడి వున్న స్ప్రే మెషీన్ పై పడింది! బటన్ నేలకు నొక్కుకుపోవడంతో, స్క్రూ ఆన్ అయింది!!!

కాలు తీసుకొనే వ్యవధి లేకపోయింది అరవిందానికి! రాతిపొరను చెక్కగల లావాటి బలమైన ఇనుప స్క్రూ అతడి బూటును ఛేదిస్తూ అరికాలుకు తగిలింది!!

భరించలేని బాధతో కెవ్వుమని అర్చాడు అరవిందం. విలవిల్లాడుతూ కాలును పట్టిన స్క్రూని విదిలించాడు. మెషీన్ పక్కకుపడి, తిరుగుతూనే వుంది శబ్దం చేస్తూ! చనిపోయిన పాల్ కళ్ళుమాత్రం నిశ్చలంగా వున్నాయి తెరుచుకొని!!

బొటబొటా రక్తం కారిపోతుంది అరవిందం కాలు నుండి! స్ట్రా లోపలికి దొలిచింది అతని కాలును! షర్టు చింపి కట్టు కట్టాడు. బాధను పళ్ళ బిగువున ఓరుస్తూ వేన్ దగ్గరికి వెళ్ళి మెటల్ నింపిన తొట్టి లింక్ ను తొలగించి, వేన్ యొక్క స్టార్టు చేశాడు!!

మెల్లగా టర్నింగ్ తిప్పి ముందుకు పోనిచ్చాడు.

సరిగ్గా అదే సమయంలో మరో వైపునుండి రఘువీర్, మరి కొంతమంది పోలీసులు ఎక్కివున్న పోలీసు జీపు, వెనగ్గా జగదీష్ కారు ఆ భవనం దగ్గరకు ప్రవేశించాయి.

వాహనాలు ఆగాక — జీపులోనుండి రఘువీర్ దిగి నిలబడ్డాడు. హెడ్ కానిస్టేబుల్స్ చకచకా క్రిందికి దిగారు.

కారు డోర్ తెరుచుకొని దిగి చెప్పాడు జగదీష్.

"రఘువీర్, ఇక్కడినుండే రివాల్వర్ పేలిన శబ్దాలు వినిపించాయి. భవనం లోపలికి వెళ్ళిచూద్దాం!?"

రఘువీర్ చెప్పడంతో కానిస్టేబుల్స్, హెడ్ జగదీష్ వెంట లోపలకు ప్రవేశించారు! చుట్టూ చూస్తూ బయట నిలబడిన రఘువీర్ కు అకస్మాత్తుగా కనిపించింది, మూడింగా వెళ్ళిపోతున్న వేన్! రఘువీర్ కనుబొమ్మలు ముడిపడ్డాయి!!

కాసేపట్లో జనార్దన్ని దృఢంగా పట్టుకొని పోలీసులు, జగదీష్ బయటకు వచ్చారు!

రఘువీర్ జీపు ఎక్కి స్టార్టుచేసి "జగదీష్! మరొకడు వేన్లో పారిపోతున్నట్టున్నాడు. నేను వెంబడిస్తాను. మీరంతా స్టేషన్ దగ్గరుండండి!" అన్నాడు జీపును స్పీడుగా ముందుకురికిస్తూ.

నిర్మానుష్యంగా వున్న ఆ రోడ్డుపై చివరికి కనిపిం

చింది రఘువీర్ కు, చాలాదూరంగా సాగిపోతున్న వేన్! జీపు స్పీడు పెంచాడు క్రమంగా. వేన్ దగ్గరకు సాగింది.

అరికాలిలో గాయాన్ని ఓరుస్తూనే చేతులు స్టీరింగ్ పై బిగబట్టి డ్రైవ్ చేస్తున్నాడు అ ర విం దం. మెరుపు వేగంతో ముందుకు పోతూంది వేన్. అయినా వెనుక వదలకుండా వెంబడిస్తూంది జీపు.

దాదాపు ఐదునిమిషాలు గడిచాయి. ఎదురుగా రోడ్డు మలుపుతిరిగి వుండడం గమనించిన రఘువీర్ తన వాహనం స్పీడ్ ని తగ్గించి వేశాడు. అరవిందం మాత్రం అలాగే పోనిస్తున్నాడు వేన్ ను. ఇంతలో మలుపు దగ్గరయ్యింది బాగా!!

అరవిందం బ్రేక్ పై కాలువుంచి తొక్కి కొద్దిగా నొక్కబోయాడు!? గాయంతో పుండుగా మారిన అతడి కాలు అందుకు సహకరించలేదు!! అంతవరకూ బ్రేక్ వేసే అవసరం రాకపోవడం వలన అరవిందం గ్రహించలేదు, తన కాలు అందుకు పనికిరాదని!!!

అంతే! రెండు క్షణాలు కంగారుపడ్డాడు అరవిందం. ఇంతలో మలుపు వచ్చేసింది. ఎడంకాలుతో బ్రేక్ నొక్కుదామని కాళ్ళు కదుపుతూ కుడివైపుకు ఒరిగాడు అరవిందం. స్టీరింగ్ కంట్రోల్ తప్పింది ఆ కంగారులో!? చేతులు వణుకుతుండగా బ ల మం తా ఉపయోగించి తిప్పాడు స్టీరింగ్!! కొద్దిగా తిరిగింది స్టీరింగ్ ....

కారు, శరవేగంతో దేకుతున్నట్టుగా రోడ్డును దాటి వెళ్ళి, క్రింద గడ్డి ప్రదేశంలో ముందుకే వేగంగా పోయి ఎదురుగా దగ్గర దగ్గరగా వున్న రెండు పెద్ద చెట్లను గుద్దింది పెద్ద ధ్వనితో!!!

మెడ విరిగిన అరవిందం ఆ క్షణమే చనిపోయాడు.

రఘువీర్ జీపు ఆపి త్వరగా క్రిందికి దిగి, నడుచుకుంటూ వచ్చి రోడ్డు అంచున నిలబడి, ఇంజన్‌తో పాటు చాలా భాగాలు తుక్కు తుక్కు అవగా పొగలు కక్కుతూన్న జీప్‌ను చూడసాగాడు....

—: అయిపోయింది :—